


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## సాధారణ బహుమతి పొందిన నవల

**(గత సంచిక తరువాయి)**

**"నన్ను నీ ఒడిలో పడుకోనియ్యి హేమ్."** అంటూ నెమ్మదిగా అతడి ఒడిలో తలపెట్టుకుని పడుకుంది లత. ఆమె తల నిమురుతూ కూర్చున్నాడు అతడు. అలాగే పసిపిల్లలా నిద్రపోయింది లత. నెమ్మదిగా లేచి, ఆమె తలను నెమ్మదిగా దిండు పైకి జరిపి, హేమంత్ తన బెడ్ మీదకు వెళ్ళి పడుకున్నాడు. అతడికి నిద్రపట్టింది. మెళకువ వచ్చేసరికి హేమంత్‌కు లత తన గుండెపై తలపెట్టుకుని పడుకుందని అర్ధమైంది. ఆమెకు నిద్రాభంగం అవ్వకుండా నెమ్మదిగా లేచి కూర్చున్నాడు. అతడికి మరింత దగ్గరగా జరిగి ముడుచుకు పడుకుంది లత.

పాపం ఎన్ని కష్టాలు పడిందో? తను విషంలాంటి గతాన్ని గుండెలో మోస్తూ శిక్షను అనుభవిస్తున్నాడు. చెరో మూలకు నిర్దాక్షిణ్యంగా విసిరిపారేసిన విధి, తిరిగి ఇద్దర్నీ ఇలా కలిపింది.

ఎంతో ఆశ్చర్యంగా లత ప్రయాణం చేస్తున్న ట్రెయిన్‌లోనే తను ఎక్కటం! లేకుంటే లత ఎక్కడో! తను ఎక్కడో! లతకు ప్రాణం పొయ్యమని తన దగ్గరకే చేర్చటం! తలచుకుంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది హేమంత్‌కు. అదే ఒక సినిమా కనుక అలా జరిగింది అనిపిస్తుంది. కాని జీవితంలో ఇదొక ఊహించని మలుపు.

❦❦❦

జీవితపు పుటలు వేగంగా తిరిగిపోతున్నాయి. ఈ మాత్రం జాలి అయినా చూపాడు పైవాడు. లత నిద్రపోతుంటే ఆమె పక్కనే కూర్చోగల అదృష్టమైనా కలిగింది. తనను హాస్టల్ దగ్గర డ్రాప్ చేసి తిరిగి వెళ్ళేటప్పుడు మనసులో అనుభవం అయ్యే బాధను భరించి ఉన్నాడు.

పెద్దలతో మాట్లాడి, ఆ దూరాన్ని ఒక వివాహబంధంతో తగ్గించుకుందాం అనుకున్నాడు. లతను తన జీవితంలోకి ఆహ్వానించుదాం అన్న ప్రయత్నంలో జీవితమే తలకిందులైపోయింది. తుఫాన్ తాకిడికి గూడు చెదిరి చెరో దిక్కుగా కొట్టుకుపోయిన పక్షుల్లా మిగిలారు తనూ, లత. అమ్మా, నాన్నా కళ్ళెదుటే కనిపించకుండా పోయారు. పగిలిన మనసును

ఎలాగో అతికించుకుని తనను నమ్ముకున్న వ్యక్తులకోసం, ఇంకా అమ్మా నాన్నగారు కమిట్ అయిపోయి వున్న, అసంపూర్ణంగా మిగిలిపోయిన, గమ్యం చేరకుండా పోయిన ప్రయత్నాలను పూర్తి చేస్తూ వస్తున్నాడు. మిగిలిన ఆ తృప్తినే మనసుకు అయిన గాయానికి ఔషధంగా చేసుకునున్నాడు తను.

లత రెండవసారి తన జీవితంలో ప్రవేశించింది. ఈసారి ఏ విధికీ తమ మధ్యకు ప్రవేశించే అవకాశాన్ని ఇవ్వకూడదు అని నిర్ణయించుకున్నాడు హేమంత్.

రోజులు గడిచిపోతున్నాయి. లతకు పాపం ఏమీ తెలియదు. ఈ కొద్దిపాటి అదృష్టమైనా కలిగిందన్న ఆలోచన తప్పుకాదు. కాని వివాహబంధంతో లతను తన జీవితంలోకి పూర్తిగా ఆహ్వానించాలి. ఆ విషయమై ఒకసారి విన్సెంట్ సార్‌తో మాట్లాడాలి అనిపించింది హేమంత్‌కు.

అంతలో తలుపు మీద ఎవరో కొడుతున్న శబ్దం వస్తుంది. నెమ్మదిగా వెళ్ళి డోర్ ఓపెన్ చేశాడు.

డాక్టర్ విన్సెంట్, అరుణ్ ఉన్నారు ఎదురుగా.

"రండి సర్. రండి, రా అరుణ్." అంటూ లోపలకు ఆహ్వానించాడు.

"లత నిద్ర పోతుంది సర్." అంటూ కూర్చున్నాడు.

"మొన్న చెక్‌అప్‌కు చేసిన టెస్ట్‌ల రిజల్ట్స్ అన్నీ కూడా బాగున్నాయి హేమంత్. నథింగ్ టు వర్రీ. ఆపరేషన్ అయ్యాక ఇది ఏడో నెల నడుస్తుంది.." ఆగాడు విన్సెంట్.

"ఎలా ఉన్నారు మీరిద్దరూ?" తిరిగి అడిగాడాయన.

నవ్వేసాడు హేమంత్. "ఎడారిలో పరిగెత్తే వాడికి చిన్న నీడ కూడా హాయినిస్తుంది. ఒక్క నీటి బొట్టు కూడా ప్రాణాన్ని నిలుపుతుంది. అదే ఫీలింగ్‌తో, ఇద్దరం ఒక చోటే కలిసి ఉన్నాం అన్నదే జీవితంలో పెద్ద ఎఛీవ్‌మెంట్‌లా అనిపిస్తుంది సర్."అంటూ.

"హేమంత్, మా అమ్మాయిని నీకిచ్చి వివాహం చెయ్యాలని ఆలోచిస్తున్నాను. చేసుకుంటావా? కట్నం భారీగా ఇచ్చుకోవాలా చెప్పు?"

నివ్వెరపోయాడు హేమంత్. 'తను ఆయనను కలిసి చెప్పాలనుకున్నదే ఆయన తన దగ్గరకు వచ్చి ప్రస్తావించటం జరిగింది.'

హేమంత్ వెళ్ళి డాక్టర్ విన్సెంట్ పాదాలను తాకాడు. అతడి కళ్ళు చెమర్చాయి.

"సర్, ఏ జన్మలో పుణ్యమో, ఏ అనుబంధమో చదువులు నేర్పిన గురువే మాకు తండ్రిగా నిలబడి మా బాగోగులు చూస్తున్నారు. మీరు ఎపుడూ 'గాడ్ ఈజ్ గ్రేట్' అంటున్నా అది నేనెపుడూ డీప్‌గా తీసుకో లేదు.మాకు గాడ్ మీరే సర్. కనిపించని ఆ దేముడు నా జీవితాన్నే చిన్నాభిన్నం చేశాడు. అన్యాయం అనిపించిందేమో తిరిగి మీ రూపంలో వరాలిస్తున్నాడు." అంటూ ఆయన ఒడిలో తలపెట్టుకుని పాదాల దగ్గర కూర్చున్నాడు హేమంత్.

అతడిని లేవదీసి గుండెకు హత్తుకున్నాడు విన్సెంట్. హేమంత్ కళ్ళు తుడిచాడు అతడు.

"ఇక నీకు అంతా మంచే జరుగుతుంది హేమంత్. మనుషులం అనుకోకుండా కొన్ని తప్పులు చేస్తాం. ఒకోసారి దిద్దుకునే అవకాశం ఉంటుంది. ఇపుడు మీ ఇద్దరి విషయంలో ఆయన చేస్తున్నది అదే!" అంటూ పైకి చూపాడు విన్సెంట్.

మెళుకువ వచ్చి లేచి వచ్చింది లత. వారిని చూసి నిలబడిపోయిన లతను అరుణ్ వెళ్ళి తీసుకు వచ్చాడు.l

"రా అమ్మా." అంటూ.

"గుడ్‌మార్నింగ్ డాడ్." అంది లత డాక్టర్ విన్సెంట్‌ను ఉద్దేశించి.

"గుడ్‌మార్నింగ్ తల్లీ." అన్నాడు ఆయన.

విషయం నెమ్మదిగా చెప్పాడు అరుణ్. "నీ ఉద్దేశ్యం ఏంటమ్మా?"అని అడిగేడు.

చిన్నగా నవ్వింది హేమంత్ వైపు చూసి, "నా కేర్ టేకర్ ఏమంటున్నాడు సర్?" అంటూ.

"చూసావా హేమంత్. నువ్వంటే ఎంత గౌరవమో?" అన్నాడు అరుణ్.

నవ్వేశాడు హేమంత్ "గౌరవమా?" అంటూ.

"కొంచెం అటూ ఇటూ ఏదైనా మాట్లాడానంటే మీరు వెళ్ళాక నా పెళ్ళి నిజంగానే చేసేస్తుందిరా".

నవ్వారు అందరూ.

అంతలో సుమ అందరికీ టిఫిన్‌లు తీసుకువచ్చింది.

"అయ్యో ఎందుకమ్మా అంత శ్రమ పడతావు?" నొచ్చుకున్నాడు హేమంత్.

"అదేం కాదు అన్నయ్యా. నీ పెళ్ళికి నాకు ఆడపడుచు కట్నం వస్తుంది .మామయ్యగార్ని, వదినను అడుగుదాం అని వచ్చాను, టిఫిన్‌ల సాకుతో."

డాక్టర్ విన్సెంట్ కళ్లలో ఆనంద భాష్పాలు వచ్చాయి.

"అమ్మా సుమా, నీకు కొడుకు ఉన్నాడుగా. మరి త్వరలో ఆ ఏర్పాట్లు చూడమను మీ అన్నను, వదినను." అన్నాడాయన.

లేట్‌గా అర్థమైంది హేమంత్‌కు. లత వైపు ఓరగా చూసాడు.

"సరే, అందరూ హ్యాపీ కదా! విషయానికి వస్తే, వచ్చే ఆదివారం లత, హేమంత్‌ల పెళ్ళికి ముహూర్తం కుదిరింది. అందరం మనమే. ఆ ఏర్పాట్లు చూడండి అందరూ . అలా అని పేషెంట్లను నెగ్లెక్ట్ చెయ్యకండి." చెప్పాడు విన్సెంట్.

అందరూ కలిసి టిఫిన్లు తిన్నారు. అక్కడ ఒక పండుగ వాతావరణం చోటు చేసుకుంది.

"లతా తొందరగా తయారవ్వు. అరుణ్, సుమ వచ్చేస్తున్నారు. చిన్న షాపింగ్ ఉంది." లతను దగ్గరకు తీసుకుంటూ అన్నాడు హేమంత్.

"ఇవాళ ఫ్రెండ్ షిప్ డే కాదు, బర్త్‌డే కాదు. షాపింగ్ దేనికి?" అంది.

"చూస్తావుగా దేనికో." అన్నాడు.

నలుగురూ కలిసి చాలా కొన్నారు. లతకోసం పట్టు చీరలు, అవసరమైన జ్యూయెలరీ తీసుకున్నారు.అందరికీ బట్టలు తీసుకున్నారు. అలాగే హాస్పిటల్ స్టాఫ్‌కు కూడా బట్టలు తీసుకున్నాడు హేమంత్. తిరిగి వచ్చేక బెడ్ పై వాలుతూ అంది లత,

"ఇవన్నీ ఎందుకు హేమ్?"

"ఇవన్నీ నిన్ను నా స్వంతం చేసుకునే ఏర్పాట్లు." అన్నాడు బెడ్ పై కూర్చుంటూ.

"ఓహ్ అయితే ఇపుడు నేను నీ స్వంతం కాదా?" అడిగింది జరిగి అతడి ఒడిలో తల పెట్టుకుంటూ.

"నీకు ఏం తేడాగా ఉండటంలేదా? ఇపుడూ స్వంతమే అనుకో, కాని నిన్ను పూర్తిగా నా స్వంతం చేసుకోవాలని కోరిక." అంటూ లతను దగ్గరకు తీసుకుని గుండెకు హత్తుకున్నాడు.

లత సిగ్గుగా మరింత ఒదిగిపోయింది అతడి గుండెలో.

ఆమె చేతిని చేతిలోకి తీసుకున్నాడు. "లతా నీకు ఈ పెళ్ళి ఇష్టమే కదా?" అడిగాడు.

"పిలిచి నీ మనసులో సింహాసనం వేస్తున్నావు నాకు. ఇంతకాలం తర్వాత 'ఇష్టమేనా?'అని అడిగావ్ హేమ్.అది నీ ఉన్నత సంస్కారం. "నేను బ్రతికి ఉన్నదే నీ కోసం. బ్రతికించుకున్నదే నీకోసం. ఎన్నిసార్లో చావు అంచులవరకు వెళ్ళి వెను తిరిగాను. ఎందుకో తెలుసా? తర్వాత ఎప్పుడో వస్తావేమో, నేను లేనని తెలిసి తట్టుకోలేవని! నువ్వు అలా బాధ పడకూడదన్న ఆలోచనే ఎప్పటికప్పుడు నన్ను వెనక్కు తీసుకొచ్చింది. అదే నన్ను బ్రతికించి ఇలా నీకు అందించింది హేమ్. ఇపుడు నన్ను పూర్తిగా నీలో, నీ జీవితంలో చేర్చుకో!" అంటూ ఉద్వేగంతో అతడిని లతలా చుట్టేసుకుంది లత.

ఇద్దరి కళ్ళు ఉద్వేగంతో నీళ్లు నిండాయి.

వారి బంధాన్నీ, బాధనూ చూసిన విధి 'ఎంత తప్పు చేసానూ వీళ్ళను విడదీసి!' అనుకుంటూ భారమైన గుండెతో ముందుకు కదిలిపోయింది.

హేమంత్, లతల వివాహం నిరాడంబరంగా జరిగిపోయింది. డాక్టర్ విన్సెంట్ ఆడపిల్ల తండ్రి బాధ్యతను వహించాడు. అరుణ్, సుమ హేమంత్ పక్కననిలిచారు.

ఇద్దరూ విన్సెంట్ సర్ కాళ్ళకు దణ్ణం పెట్టారు. ఆయన ఇద్దర్నీ దగ్గరకు తీసుకున్నాడు. చెమ్మగిల్లిన కళ్లతో లతను హేమంత్‌కు అప్పగించాడు ఆయన. ఆయన ప్రొఫెసర్ సర్వీసులో చాలా ప్రేమ జంటలను చూసాడు. కాని అతడి మనసుతో ఒక అనిర్వచనీయమైన బంధాన్ని ఏర్పారుచుకున్నది ఈ జంట మాత్రమే!

అందరి దగ్గర వీడ్కోలు తీసుకుని విమానం ఎక్కారు ఇద్దరూ. ఆగ్రాలో దిగేసరికి ఎయిర్‌పోర్ట్‌లో ఒక కొత్త కారుతో ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఉన్నాడు రెడీగా.

కీ బంచ్ లో ఒక కార్డ్ ఉంది.

గిఫ్ట్ ఫ్రమ్ 'అరుణ్' అని ఉంది.

కారు కంపెనీ ఎగ్జిక్యూటివ్, కారు స్పెషల్ ఫీచర్స్ అవీ ఎక్స్‌ప్లెయిన్ చేసి, పేపర్లవీ ఇచ్చి వెళ్ళిపోయాడు.

బటన్ నొక్కితే టాప్ వెనక్కు స్లైడై ఓపెన్ టాప్‌గా మారుతుంది. హేమంత్ వెంటనే అరుణ్‌కు రింగ్ చేసాడు.

"హలో" అన్నాడు అరుణ్.

మళ్ళీ "ల్యాండ్ అయ్యారా?" అడిగాడు.

"ల్యాండ్ అయ్యాం. మళ్ళీ బోర్డ్ అయ్యాంరా."

"అదేంటి?"

"అంత లగ్జరియస్ కారు గిఫ్ట్ చేస్తావా?"

"మీరు ఇద్దరు ఆగ్రాకు వెళ్ళిన పర్పస్‌కు సూట్ కావాలని"

"అంటే?"

"తాజ్‌ను చూసేటప్పుడు టాప్ ఓపెన్ చేసుకో."

"మరి క్లోజ్ ఎప్పుడు చెయ్యాలిరా, అది కూడా చెప్పు."

"నే చెప్పాలా? నా కంటే ఎక్కువ నాలెడ్జ్ నీకే ఉంది. కారుండగా ఎపుడూ కూడా బైక్ నే ఎందుకు యూజ్ చేసే వాడివో చెప్పరా?" కొంటెగా అడిగాడు అరుణ్.

"నువ్వు మాములోడివి కాదురా! వచ్చాక చెప్తానీ పని.ఎనీవే థ్యాంక్ యు రా." అంటూ నవ్వుకుంటూ కట్ చేసాడు ఫోన్.

కొత్త కార్లో కొత్త జంట ఎయిర్ పోర్ట్ నుంచి బయల్దేరి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే, లక్ష్మణ్ ఇచ్చిన ఇన్‌ఫర్మేషన్‌తో, ఇరుగు పొరగు వాళ్ళు, అభిజీత్ , వసుమతిల అభిమానులు, పనిచేసే స్టాఫ్, వారి కుటుంబాలు, అందరూ చేరి ఎదురు చూస్తున్నారు కొత్త జంట కోసం.

కారు చుట్టూ తిరిగి పాటలు పాడుతూ డ్యాన్సులు చేశారు అందరూ.పెళ్ళికొడుకుని, పెళ్ళి కూతుర్ని కూడా కార్లోంచి దింపారు. వాళ్ళచేత కూడా స్టెప్పులు వేయించి సంతోషించారు. ఆ కోలాహలాన్ని దాటి మళ్ళీ వెనక్కు వెళ్లి తల్లితండ్రుల జ్ఞాపకాల తలుపును తడుతున్న మనసును అదుపు చేసుకున్నాడు హేమంత్. అతడు ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నాడు 'ఈ రోజు నుంచీ కన్నీళ్ళకూ, చేదు అనుభవాలకు గుడ్‌బై!" అని.

ఇద్దరికీ దిష్టితీసి, హారతిచ్చి ఇంట్లోకి నడిపించారు.

లక్ష్మణ్‌ను పిలిచాడు హేమంత్.

"సర్" అంటూ వచ్చాడు.

"మరి ఫుడ్ అందరికీ ఆర్డర్ చేసారా? ఇక్కడికే కాదు. అక్కడ కూడా అన్ని చోట్లకు సరిపడా చేసి, వాళ్ళే వాళ్ళకు డెలివరీ చేసేలా చెప్పమన్నాను కదా. చెప్పావా?" అడిగాడు హేమంత్.

"అన్నీ మీరు చెప్పినట్టే చేసాను సార్, మన హాస్పిటల్స్ కు, ఫ్యాక్టరీ వర్కర్ల కుటుంబాలకు, ఇంకా ఆర్ఫనే జెస్ కు అందరికి కూడా అరేంజ్ చేసాను."అన్నాడు. .

"సర్. షాదీ ముబారక్ సర్" అన్నాడు లక్ష్మణ్.

లక్ష్మణ్‌ను దగ్గరకు తీసుకున్నాడు హేమంత్, "థాంక్యూ రా" అంటూ.

ఇల్లంతా గిరగిరా తిరిగేసి వచ్చేసింది లత.

"హేమ్ ఏరి? ఎవరూ లేరేంటి?" అడిగింది లత.

"వాళ్ళు చాలా దూరం వెళ్ళారు,ఎబ్రాడ్ లతా. రావటానికి టైం పడుతుంది . బహుశా మనమే వాళ్ళను తీసుకురావాలనుకుంటా!" అన్నాడు.

"మరి.. " ఏదో అడగబోయిన లతకు మధ్యలోనే అడ్డు వచ్చాడు హేమంత్" ఇంకా చాలా లేట్ అయ్యేలా వుంది అని, పెళ్ళి అంటే 'ఓకే ' చేసేశాను. " వీలైనంత కాజువల్‌గా చెప్పేసి అక్కడనుంచి బయట బాల్కనీలోకి వెళిపోయాడు.

ఏమో అడగబోయిన లత విరమించుకుంది.

సాయంత్రం ఏడుగంటలు దాటింది. లత కోసం ఎదురు చూస్తూ సోఫాలో కూర్చున్నాడు హేమంత్.

అతడు తెల్లటి లాల్చీ, పైజమాలలో రాజకుమారుడిలా ఉన్నాడు.

"లతా రెడీనా?" అంటూ పిలవబోయిన హేమంత్ ఆగిపోయాడు. ఆకాశం నుంచి జారిన నక్షత్రంలా, పాలసముద్రంలో సొగసుగా ఈదుతున్న రాజహంసలా నెమ్మదిగా మెట్లు దిగి వస్తున్న లతను చూస్తూ ఉండిపోయాడు.లత తెల్లని పాల నురుగులాంటి చీర కట్టుకుంది .తెల్లటి ముత్యాల నగలు అలంకరించుకుంది.

సోఫాలోంచి లేచాడు హేమంత్.

"లతా దివినుంచి దారి తప్పి భువికి వచ్చిన దేవకన్యలా ఉన్నావు!" అన్నాడు.

అతడు ఫ్లవర్ వాజ్‌లో ఉన్న తెల్ల గులాబీని కోసి, లూజ్‌గా వదిలేసిన కురులను లైట్‌గా బంధించిన క్లిప్‌లో పెట్టాడు.

"లతా నువ్వేనా!" అంటూ దగ్గరకు తీసుకున్నాడు.

అతడి ముఖంలోకి చూసిన లత కనురెప్పలు వాలిపోయాయి.

ఆమె నుదుటిని పెదవులతో తాకాడు,

"లవ్ యు లతా." అంటూ.

"లవ్ యు టూ హేమ్." అంటూ అతడి గుండెపై వాలింది.ఆమె చేతి వేలును అందుకుని మెట్ల దగ్గరకు నడిచాడు.నెమ్మదిగా మెట్లెక్కుతున్న అతడి వెంట నడిచింది లత. పైన టెర్రస్ మీదకు వెళ్ళారు.

అక్కడ ఏర్పాట్లు చూసి నివ్వెరపోయింది లత.

అందమైన శయ్య ఉంది మల్లెల మాలలు ఊగుతూచిమ్నీలో గాలి తగిలి ఆరిపోకుండా ఉన్న పెద్ద సైజు కొవ్వొత్తులున్నాయి లెక్కకు మించి,వెలుగులను వెదజల్లుతూ.ఒక చిన్న డైనింగ్ టేబుల్, రెండే చెయిర్స్ ఉన్నాయి. టేబుల్ పై పళ్ళు, స్వీట్స్ ఉన్నాయి ఆకర్షణీయమైన రంగులతో.

లత చెయ్యి అందుకుని "రా! లతా కూర్చో" అంటూ ఒక కుర్చీలో కూర్చోపెట్టాడు. రెండోవైపు ఛెయిర్‌లో తను కూర్చున్నాడు, లత ముఖంలోకి చూసాడు.

"ఏమిటి లతా,అలా బిగుసుకుపోయావేంటి? ఫ్రీగా ఉండు. ఇది బైక్ కాదు." అన్నాడు. నవ్వేసింది లత.

"ఈ డిష్‌లు అన్నీ ఎక్సలెంట్‌గా వుంటాయి. టూరిస్ట్ ప్లేస్ కదా,చాలా కేర్ తీసుకుంటారు ఇవి తయారు చేసిన హోటల్ వాళ్ళు.చూడు ఏమున్నాయో." అన్నాడు.

అంతలో "లతా అటు చూడు" అన్నాడు.

పున్నమి చంద్రుడు అపుడే ఉదయిస్తున్నాడు.

"ఈ రోజు ఫుల్ మూన్ అని అయిడియా లేదు నాకు" అన్నాడు.

"అవునా?" అంది.తిరిగి అతడి ముఖంలోకి చూస్తూ,

"కావాలని అరేంజ్ చేసారనుకున్నాను." అంది లత.

సెల్ తీసి రింగ్ చేసాడు లేచి పిట్టగోడ దగ్గరకు నడుస్తూ.

"హలో ఏంటిరా? ఇంకా ఫోన్‌లవీ పట్టుకు కూర్చున్నావేంటి?"

"ఫోన్ స్పీకర్‌లో ఉంది గాని, కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకు మాట్లాడు."

"సరే ఇంతకూ ఎందుకు చేసావు?"

"ఈ రోజు ఫుల్ మూన్ అని నీకు తెలుసా?"

"తెలుసు."

"ఇలా ఎలా కుదిరిందిరా?"

"లతకు తాజ్‌ను ఫుల్ మూన్‌లో చూపిస్తావని."

"అయితే నీకు ముందే తెలుసా?"

"ఈ డేట్ సెట్ చేయించింది నేనేగా."

"నాకు చెప్పాలిగా నోరు మూసుకుని ఫోన్ పెట్టరా." అన్నాడు హేమంత్.

"ఒక్కటి చెప్పి కట్ చేస్తా. అందుకే మరి పర్సనల్ లెటర్స్ వేరే వాళ్ళకి చదివి వినిపించకూడదమ్మా."

లత డైరీలో, నిండు పున్నమి వెన్నెలలో తాజ్ ను చూపాలని రాసిన మేటర్ అరుణ్‌కు చదివి వినిపించినట్టు గుర్తు వచ్చింది. ఫోన్ కట్ చేసి లతను సమీపించి,

"లతా ఇక్కడ మనకు ఎవరూ లేరు. నేనే చెప్తాను. 'హ్యాపీ వెడ్డింగ్' అంటూ లత చేతిని అందుకుని పెదవులతో తాకాడు.

"హ్యాపీ వెడ్డింగ్ హేమ్." తను కూడా కుర్చీలోంచి లేచి వచ్చి అతడి గుండెపై తల వాల్చింది.

"మనం ఎపుడూ కూడా ఇలా సంతోషంగా, హాయిగానే ఉండాలి" అన్నాడు ఆమెను గుండెకు హత్తుకుంటూ.

ఇద్దరూ ఒక సంభ్రమానికి లోనయ్యారు.

"హేమ్ మనం ఫ్రెండ్స్ నుంచి వైఫ్ అండ్ హజ్బెండ్ అయ్యామా?"

"ఎవరన్నారు? మనం ఫ్రెండ్సేగా?" అన్నాడు.

"అలాగే చాలా బాగున్నాం ఏమో."

"ఏం ఇప్పుడేం జరిగిందీ?"

"ఏం జరగలేదనే బాధ."

"అంటే? ఆశ్చర్యంగా అడిగాడు హేమ్.

"ఇక్కడ బాగోలేదు హేమ్. నన్ను ఎక్కడికైనా తీసుకెళ్ళు."

"సరే పదండి అమ్మాయిగారూ" అంటూ ఆమెను చేతులలో ఎత్తి క్రిందకు తీసుకెళ్ళి గదిలో మంచంపై వదిలాడు.

వెనుతిరిగిన అతడిని చెయ్యి పట్టి దగ్గరగా లాగింది లత. "వెళ్ళిపోకు హేమ్" అంటూ.

ఒక్కసారిగా మంచం పైకి పడిపోయాడతడు. బిత్తరపోయి అతడి ముఖంలోకి చూసింది.

"సారీ.. పడతావనుకోలేదు హేమ్." అంటూ లేవబోయింది లత.

"అనుకో

కుండానే పడిపోయాను!" అంటూ లేచి కూర్చున్నాడు. ఆమెను తన చేతులలోకి తీసుకున్నాడు.

"ఎక్కడ?" అడిగింది అతడి కళ్ళలోకి చూస్తూ.

"నా మనసును నీ కళ్ళతో బంధించి పడేసావుగా!"

"అవునా? ఫ్రెండ్షిప్ డే, బర్త్ డే గిఫ్ట్స్ ఇచ్చి నా మనసును దొంగిలించి..." ఆపైన మాట్లాడలేక అతడి గుండె పై వాలింది కళ్ళలో నీళ్లు అతడికి కనపడకుండా. ఆమెను వెనక్కు జరిపి చెంపల పైకి జారటానికి సిద్ధంగా ఉన్న నీటి ముత్యాలను తన పెదవులతో ఒత్తాడు.

"లతా నువ్వు కాలేజ్‌లో ఉన్నప్పుడు ఎలా ఉండేదానివి అలాగే హ్యాపీగా ఉండు. ఇక మనిద్దరం ఒకరికొకరం. ఎవరూ ఏం చెయ్యలేరు." ఆమెను చెమ్మగిల్లిన కళ్ళతో హృదయానికి హత్తుకుంటూ అన్నాడు.

"సరే హేమ్. ఎక్కడికైనా వెళ్దాం.. ప్లీజ్ తీసుకెళ్ళు నీ బైక్ పై."

"బైక్ వైజాగ్‌లో ఉంది. కాని డ్రైవర్ ఇక్కడే ఉన్నాడుగా." చిన్నగా నవ్వింది లత.

"రా పద త్వరగా తీసుకెళ్తాను ఒక చోటకు."

త్వరత్వరగా తయారైపోయారు.

కారు ఫ్రంట్ లెఫ్ట్ డోర్ తీసి "ఎక్కండి మేడంగారూ." అంటూ లత చెయ్యి పట్టి ఎక్కించాడు.

లత ఎక్కాక డోర్ మూసి వెళ్ళి డ్రైవింగ్ సీటులో కూర్చున్నాడతడు.

"సీట్ బెల్ట్ పెట్టుకో." లతా అంటూ అటువాలి ఆమెకు బెల్ట్ పెట్టాడు.

కారు ఆగ్రా వీధుల్లోకి బయలుదేరింది. ఇద్దరి మనసులు ఒక ఉద్వేగానికి గురయ్యాయి.లత చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. "నీ చెయ్యి తెగింది గుర్తుందా లతా?" అన్నాడు.

"చెయ్యి తెగిన గాయం అయితే మానింది, కాని నువ్వుచేసిన ట్రీట్మెంట్ మాత్రం నా మనసు మరువలేదు హేమ్. బ్యాక్ సీట్ లో నీ ఒడిలో తల పెట్టుకుని పడుకున్నాను.ఇన్నేళ్ళూ అటువంటి జ్ఞాపకాల వ్యధలే నాకు ఊపిరిలూదాయి చనిపోకుండా." కారును పక్కన ఆపేసాడు అతడు. లత చేతిని పెదవులతో తాకాడు.

"ఎక్కడకు వెళ్తున్నామో చెప్పుకో చూద్దాం." అంటూ తాజ్‌మహల్ సాంగ్‌ను ప్లే చేసాడు.

'జొవాదా కియా ఓ నిభానా పడేగా....'

"ప్రామిసెస్ ఆర్ టు బి కెప్ట్ మై డియర్ హేమ్." అంది అతడి భుజంపై తల వాలుస్తూ.

సడన్‌గా ఎదురుగా చెట్ల మధ్యనుంచి కనిపిస్తున్న తాజ్‌ను చూసి "హేమ్!తాజ్‌మహల్!" అంది బిగ్గరగా,

"వావ్! హేమంత్ థాంక్యూ." అంది అతడి ముఖంలోకి చూస్తూ.

"కాస్త కుదురుగా కూర్చో బేగం, రష్‌గా వుంది" అన్నాడు.

నవ్వేసింది లత, "ఓహ్ షాజహాన్‌గారు వచ్చారా?" అంది.

కారును వ్యూ బాగా ఉండేలా ఆపాడు హేమంత్.

బటన్ నొక్కి కారు టాప్‌ను వెనక్కు స్లైడ్ చేసాడు.

"కమాన్ లతా." అంటూ సీట్లో దగ్గరగా తీసుకున్నాడు లతను.

"చూడు తనివి తీరా. అదిగో నీ కలల తాజ్! నా ఒడిలో చేరి చూడాలనుంది అన్నావుగా. రా." అంటూ ఆమె తల తన గుండెపై ఆనేలా ఇంకా దగ్గరగా తీసుకున్నాడు.

"ప్రామిసెస్ ఆర్ టు బి కెప్ట్." అన్నావు. అంటే చేసిన బాసలు గుర్తుంచుకోమnega.

నువ్వు నాకేవైనా ప్రామిస్‌లు బాకీ ఉన్నావా చూడు. ఇదే మంచి టైమ్ తీసేసుకుంటాను,

ఆ గుర్తొచ్చింది. నా చేతిమీద కందిరీగ ఎన్నిసార్లు కుట్టింది?"

"అమ్మో, ఇక్కడ అవేం లేవు" అంది లత కంగారుగా.

"అన్నింటికీ కలిపి ఒక్కటే తీసుకోనా?"

"బాబోయ్ తెలుసు నాకు. బుగ్గమీద కొరుకుతావు." అంటూ రెండూ చేతుల్లో చెంపలను దాచుకుంది లత.

"దిగుదామా?" అడిగింది.

"బేగం ఇటువంటి చిక్కుప్రశ్నలను వెయ్యకూడదు."

"మరి ఏం అడగమంటావ్ హేమ్?" అంది.

బటన్ నొక్కాడు. టాప్ క్లోజ్ అయిపోయింది.

"లతా! నా జీవితపు ఆకాశంలో నా చందమామ ఎప్పుడూ పున్నమి కాంతులనే ప్రసరించాలని నా కోరిక. ఎపుడూ అలిసిన వేళలలో నీ ఒడిలో సేద తీరనియ్యి లతా! లతా ఒక్కో సమయంలో నిశ్శబ్దం ఎంత అందంగా ఉంటుందో, మనసులో ఎన్ని ఊసులను, ఊహలను కలబోసి కుమ్మరిస్తుందో తెలుసా!" ఆమె నుదుటిని పెదవులతో తాకుతూ అన్నాడు హేమంత్.

"తెలుసు హేమ్! ఇన్నేళ్ళూ నిశ్శబ్దంతోనే నా చెలిమి. మనసు గతపు ఊసులను తెచ్చి కళ్ళలో నిలిపేది. మళ్ళీ మనం సముద్రపు అలలతో పోటీ పడుతూ పరుగులు తీయాలనీ, అలసి నీ గుండెపై వాలి సేద తీరాలనీ కలలు కనేవి నా కళ్ళు. భయంకరమైన నిరీక్షణలో, నిరాశతో నా కళ్ళలో నీరు ఇంకిపోయింది."

"లతా, ప్లీజ్... " అంతకు మించి మాటలు కరువయ్యాయి హేమంత్ కు. చెమ్మగిల్లిన కళ్ళతో ఆమెను గాఢంగా గుండెకు హత్తుకున్నాడు.

"కాని, హేమ్ అంత నిరాశలోనూ ఒక ఆశ సుదూర తీరాల నుంచి పిల్ల తెమ్మెరలా వచ్చి మనసును తట్టి లేపేది, "నీకోసం నీ హేమ్ తప్పక వస్తాడు లతా." అంటూ.

"లతా, ప్లీజ్ మరచిపోదాం అదంతా. కష్టాల కన్నీళ్ళతో మరకలు పడిన గతపు పేజీలను జీవితం నుంచి తొలగించి వేద్దాం... మన జీవితాన్ని రంగుల హరివిల్లులా మలచుకుందాం." అంటూ ఆమెను మరింతగా దగ్గరకు తీసుకున్నాడు.

"నేను నీ నిరీక్షణలో క్షణం ఒక యుగంలా గడుపుతూ కోల్పోయిన నా సంతోషాన్ని అంతను నాకు అందించు హేమ్!"

ఎగిసి పడుతున్న లత కదలికలతో ఆమె దుఃఖిస్తుందని గమనించిన హేమంత్ కళ్ళు నిండాయి. కను రెప్పలను దాటిన నీటి ముత్యాలను ఆపలేక పోయాడు అతడు.

అలవికాని ఆవేదనతో నలిగిపోయిన రెండు హృదయాలు దుఃఖాన్ని పంచుకున్నాయి.

"హేమ్ ఏదైనా మాట్లాడు.... మౌనంగా ఉండకు.భయం అనిపిస్తుంది ఇదంతా కలేనేమోనని!"

ఆమెను దూరంగా జరిపి ఆమె ముఖాన్ని చేతులలోకి తీసుకొని పైకి ఎత్తాడు అతడు.

" కళ్లు తెరిచి చూడు లతా.... ఇది కల కాదు... నిజం!" నెమ్మదిగా కళ్ళు తెరిచింది లత.

" అవునా!" అంది అతడి కళ్ళ లోకి చూస్తూ. చిన్నగా నవ్వేడు హేమంత్.

"ఒకసారి కందిరీగ లాగ కుట్టి చూడు, నేను కెవ్వుమంటే కలో నిజమో తేలిపోతుందిగా."

" ఊహూ!" అని తల అడ్డంగా తిప్పుతూ అతడికి అల్లుకు పోయింది లత.

"లతా తాజ్ మన ముందు ఉన్నది నిజం! మన వైపు కొంటెగా తొంగి తొంగి చూస్తున్న పున్నమి జాబిలి నిజం!

తాజ్ ముంగిట నా లత హృదయ స్పందన నా హృదయ స్పందనతో ఊసులాడుతున్నది నిజం!" తల ఎత్తి అతడి కళ్ళలోకి అలవోకగా చూసిన ఆమె కనురెప్పలు సిగ్గుతో రెపరెపలాడాయి.

"లతా.... తాజ్ ను చూడాలని కలలు కన్నావ్...తనివితీరా చూడు లేచి." అతడి కళ్ళలోకి చూసిన లత కళ్ళలో నిండిన నీటిపోరలో జాబిలి తళుక్కుమంది.

"నీవు లేకుండా గడిపిన ప్రతి క్షణం నా గుండెను నిర్దయగా కోసింది. ముందు ఆ గాయాలను నయమవ్వనియ్యి నీ సన్నిధిలో.... ఇంకేం కోరుకోదు నీ లత. " అంటూ మరింతగా అతడి గుండెలో ఒదిగి పోయింది.

"ఒక్కసారి తాజ్ ను చూడు లతా... ఆకాశం వైపు, నీవైపు మార్చి మార్చి చూస్తుంది ఆశ్చర్యంగా, ఈ పున్నమికి రెండు జాబిలిలు వచ్చేయి ఏంటా అని."

"నన్ను ఇలాగే ఉండనియ్యి హేమ్. నీ ఈ తీయని సాన్నిహిత్యాన్ని నన్ను తనివితీరా అనుభవించనియ్యి." అంటూ మరింతగా అతడి గుండెలో ఒదిగి పోయింది లత.

'పాపం ఎన్ని బాధలను ఓర్చుకుని తనను చేరింది! ' ఆమె ను మరింతగా దగ్గరకు చేర్చుకున్న అతడి కళ్ళు చెమ్మగిల్లాయి.

శతాబ్దాలుగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, గత చరిత్ర తాలూకు వ్యధను గుండెలో మోస్తూ, తనను చూసి మురిసిపోవాలని సుదూర తీరాల నుంచి వచ్చే ప్రేమ జంటలను పలకరించటం కోసం ఓర్పుతో నిలిచివున్న తాజ్ కు హేమంత్, లతల జంటను చూసి, వారి ఆవేదనను విని గుండె కలుక్కు మంది! చలువరాతి మాటున వున్న తాజ్ కళ్ళు అప్రయత్నంగా చెమర్చాయి! (సమాప్తం)

COMMENTS